

నేడు కలెక్టరేట్‌లో రాజ్యాంగ దినోత్సవం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

రాజ్యాంగ దినోత్సవాన్ని శనివారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆధ్వర్యంలో డ్రాఫ్టింగ్ కమిటీ రాజ్యాంగం రూపొందించిన అనంతరం 1950 జనవరి 26న రాజ్యాంగం అమల్లోకి వచ్చినట్లు చెప్పారు. ప్రపంచంలో అతి పెద్దదైన ప్రజాస్వామ్య దేశమైన మన రాజ్యాంగం ఎంతో ఉన్నతమైనదన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో శనివారం ఉదయం రాజ్యాంగ దినోత్సవం ఘనంగా జరిపేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అధికారులు, సిబ్బంది అందరూ హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. దినోత్సవం నేపథ్యంలో పలు కార్యాలయాల్లో రాజ్యాంగ పీఠికను అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా చదవాలన్నారు. రాజ్యాంగ ఔన్నత్యాన్ని కాపాడడానికి బద్ధులై ఉండాలన్నారు.

ప్రజాస్వామ్యానికి పునాది రాజ్యాంగం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

భారత ప్రజలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో సమానత్వం లభించేలా సామాజిక న్యాయాన్ని ప్రోత్సహించేలా రాజ్యాంగాన్ని రూపొందించారని వైసిపి సిజిసి సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. స్థానిక ఆంధ్రకేసరి యువజన సమితి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, సర్వీస్ బ్యాంక్ సంయుక్త నిర్వహణలో స్వాతంత్ర సమరయోధుల పార్కులో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న రాజ్యాంగ దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలను ప్రజలకు రక్షణ కవచాలుగా నిలిచాయని చెప్పారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కమిటీ మెంబర్ డాక్టర్ లంక సత్యనారాయణ మాట్లాడుతూ జీవించే హక్కు, చట్టం అందరికీ సమానమేనని తెలిపారు. అధ్యాపకులు ఎం.రాధా ప్రసాద్ మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కులు, రక్షణకు భంగం కలిగితే నేరుగా దేశ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడం భారత రాజ్యాంగం ద్వారా మాత్రమే సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర కేసరి యువజన సమితి అధ్యక్షులు పెదిరెడ్ల శ్రీనివాసరావు, దేశిరెడ్డి బలరాం నాయుడు, ప్రొఫెసర్ డాక్టర్ మల్లి భాస్కర్, సర్వీస్ బ్యాంక్ చైర్మన్ పి.స్వర్ణలత, న్యాయవాదులు జి.అనంతరావు, ఆర్.వరప్రసాద్, చెవ్వాకుల వంశీకృష్ణ, మద్దాల అను, డాక్టర్ పివి.సంజీవరావు, విద్యార్థి నాయకుడు విజయ్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు

వివక్ష, వేధింపుల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

పని చేసే ప్రదేశాల్లో, విద్యలో స్త్రీలపై వివక్ష, లైంగిక వేధింపులపై ప్రజల్లో అవగాహన కోసం ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నవంబర్ 25 నుంచి డిసెంబర్ 23 వరకు నిర్వహిస్తున్నామని డిఆర్‌డిఎ పీడీ ఎస్.సుభాషిణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్త్రీలపై దాడులు, వేధింపులు, తదితర చర్యలను అరికట్టడానికి, జెండర్ ప్రచారాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. బాల్య వివాహాలను అరికట్టడం, ఆడపిల్లల అక్రమ రవాణాను అరికట్టడం, గృహ హింస, వరకట్న సమస్య, చేసిన పనికి గుర్తింపు లేకపోవడం, ఆడ, మగ బిడ్డల పెంపకంలో తేడా, లింగ వివక్షపై జాతీయ స్థాయి ప్రచారం, ప్రతి మండలంలో స్వయం సహాయక సంఘాలు మహిళలు, ఇతర ప్రభుత్వాధికారులతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఏ రోజు ఏ కార్యక్రమాలు చేయాలనే వాటిపై అధికారుల పర్యవేక్షణలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

బాలోత్సవం బ్రోచర్లు అందజేత

ప్రజాశక్తి - దేవరపల్లి

మండలంలో మహనీయుల ఆశయాలు ప్రచార కమిటీ, మానవత సంస్థ, యుటిఎఫ్, స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యాన దేవరపల్లి బాలోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా తహశీల్దారు ఎం.రామకృష్ణకు దేవరపల్లి బాలోత్సవం బ్రోచర్‌ను శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమ నిర్వహణకు తగిన సహాయ సహకారాలు అందించాల్సిందిగా కోరారు. బాలోత్సవం విజయవంతానికి తాను అన్ని రకాల సహకారాలు అందిస్తానన్నానని తహశీల్దారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి బండి సూర్యప్రకాశరావు ఉపాధ్యక్షులు ఉండవల్లి కృష్ణ, పప్పు వెంకట రామారావు, నలమాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.



ఖండవల్లిలో మలేరియా అధికారి గొల్లరాజు

సమస్యల పరిష్కారానికే గడపగడపకూ..

దేవరపల్లి : ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారం కోసమే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని గోపాలపురం ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు అన్నారు. దేవరపల్లి మండలం బంధపురంలో శుక్రవారం ఆయన 145వ రోజు గడపగడపకూ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వివరించారు. ఎంపిపి కెవికె.దుర్గారావు, ఎఎంసి చైర్మన్ జనార్ధన్‌రావు, తహశీల్దారు ఎం.రామకృష్ణ, ఎంపిడిఒ ఉమామహేశ్వరశర్మ పాల్గొన్నారు.

7వ రోజుకు నవీన్ పాదయాత్ర

ప్రజాశక్తి- గోకవరం

టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ పాదయాత్ర గోకవరంలో శుక్రవారం ఏడో రోజుకు చేరింది. ఈ పాదయాత్ర కృష్ణునిపాలెం, కొత్తూరు, వెంకటాపురం, రామ్మూర్తి పేట, రామన్నపాలెం, చిన్నూరు, రామానుజపురం, ఆర్ అండ్ ఆర్ కాలనీ వరకు సాగింది. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ వైసిపి నాలుగేళ్లలో నిరుద్యోగ సమస్య, అడ్డగోలుగా నిత్యావసర వస్తువుల ధరల పెంపు, మద్యపానం, మాదకద్రవ్యాలతో యువత జీవితాలు నాశనం చేయడం, కుంటుపడిన అభివృద్ధి, పట్టణాలు గ్రామాల్లో తాగునీటి సమస్య సిఎం దగ్గర నుంచి సామాన్య కార్యవర్గం వరకు అవినీతి చేయడం, మహిళలకు భద్రత లేకపోవడం, విద్యుత్ సమస్యలు, నిధుల దుర్వినియోగం, గిట్టుబాటు ధర లేక రైతుల ఇబ్బందులతో ప్రజలు బాధలు పడుతున్నారని చెప్పారు.

వికలాంగులకు బస్ పాసులు

ప్రజాశక్తి-కడియం

మండలంలోని దుళ్ల పరిధిలోని వికలాంగులకు రావులపాలెం ఆర్‌టిసి డిపో ఆధ్వర్యంలో మూడేళ్ల రాయితీ బస్ పాస్‌ను గ్రామ పంచాయతీ ఇన్‌ఛార్జి సెక్రెటరీ సరోజా రాణి, డిపో కో-ఆర్డినేటర్ వివివి.సత్యనారాయణ రాజు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడికైనా ఈ బస్సు పాస్ ద్వారా సగం రాయితీతో ప్రయాణం చేయవచ్చని చెప్పారు. దుళ్ళ గ్రామంలో సుమారు 40 బస్సు పాసులు అందించామని తెలిపారు. వరికైనా అవసరం అయితే తమను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ విజయలక్ష్మి, వెల్ఫేర్ అసిస్టెంట్ రేవతి, లాల్ బీబీ, డిజిటల్ అసిస్టెంట్ సాయి తేజ, యమున, ప్రశాంతి, తోకల శ్రీను పాల్గొన్నారు.

రాజ్యాంగంపై క్విజ్ పోటీ

ప్రజాశక్తి-కడియం

కడియం ఉన్నత పాఠశాలలో సోషల్ క్లబ్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సీనియర్, జూనియర్ విభాగాల్లో క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. తొలుత పాఠశాల హెచ్ఎం టి.సత్యనారాయణ రాజ్యాంగం విశిష్టతను వివరించారు. సీనియర్ విభాగంలో ఎ.సత్య శిరీష్, ఝాన్సీ, కృపరాజులు నిలిచారు. హనుమంతరావు పాల్గొన్నారు.

టిబి నిర్మూలన దిశగా అడుగులు

ధవళేశ్వరం : ధవళేశ్వరం పిహెచ్‌సిలో టిబి ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ సుధాకర్ ఇద్దరు టిబి రోగులను దత్తత తీసుకుని పోషకాహార కిట్లు అందజేశారు. ఈ విధంగా 6 నెలల పాటు వారికి అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ టిబి నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ దేవి, చరణ్, ఆనంద్ కుమార్, రాంబాబు టిబి నరేష్, కుమారి, రమణ, జ్యోతి పాల్గొన్నారు.

పెరవలిలో మలేరియా అధికారి పర్యటన

ప్రజాశక్తి-పెరవలి

పెరవలి పిహెచ్‌సి పరిధిలోని పలు ప్రాంతాల్లో జిల్లా మలేరియా అధికారి గొల్లా వీర్రాజు శుక్రవారం పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధిని వ్యాప్తి చేసే టైగర్ మస్కిటో పగటి పూట కుడుతుందని, పగటి పూట కుట్టే దోమ కాటు నుండి తప్పించుకోవడం కష్ట సాధ్యమైన విషయం కాబట్టి, ఈ దోమ పుట్టకుండా ఇంటి లోపల ఫ్రిజ్‌లు, కూలర్లను వారానికి ఒకసారి శుభ్ర పరుచుకోవడం, ఇంటి ఆవరణలో నీరు నిల్వ ఉండడానికి అవకాశం ఉన్న నిరుపయోగ సామాగ్రి ఎప్పటికప్పుడు తొలగించుకోవడం, వాడకంలో లేని కంటైనర్లను బోర్లించి ఉంచడం ద్వారా టైగర్ దోమ పుట్టుకను నివారించాలని వివరించారు. ప్రజలకు డెంగ్యూ నివారణలో ఫ్రైడే డ్రై డే ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలని క్షేత్ర స్థాయి సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పెరవలి పిహెచ్‌సిని సందర్శించి లాబ్ రికార్డ్స్‌ను పరిశీలించి లాబ్ టెక్నీషియన్ ఇన్‌ఛార్జి వెంకటపతికి సూచనలు చేశారు. పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎ.సత్యకృష్ణవేణితో ఫీవర్స్ డేటా, ఫీవర్ సర్వే డేటా, ఫ్రైడే డ్రై, వెక్టార్ కంట్రోల్ హైజీన్ గురించి వాకబు చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు, హెల్త్ సూపర్వైజర్ టి.వి.వరప్రసాద్, పంచాయతీ సెక్రటరీ కిషోర్ బాబు, విలేజ్ హెల్త్ సెక్రెటరీలు ఎమ్.సరస్వతి, ఇ.దుర్గాదేవి, హెల్త్ అసిస్టెంట్స్ వి.రాజశేఖర్, ఎం.శ్రీనివాస్, కె.లక్ష్మి పాల్గొన్నారు.



ఖండవల్లిలో మలేరియా అధికారి గొల్లరాజు

నేటి నుంచి భవన కార్మిక సంఘం సభలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

భారత భవన నిర్మాణ కార్మిక సంఘం జాతీయ మహాసభలు రాజమహేంద్రవరంలో శనివారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి తాటిపాక మధు తెలిపారు. కార్మిక సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షులు విజయకొని సేరి, జాతీయ కార్యదర్శి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులు సరైన ఉపాధి అవకాశం లేక సంక్షేమ బోర్డు ఫలాలు సక్రమంగా అందక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం సంక్షేమ బోర్డులో రూ.కోట్లాది నిధులు వాడుకుంటూ కార్మికులకు ద్రోహం చేస్తున్నారని దుయ్యబట్టారు ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మిక చట్టాల సవరణలపై భవన నిర్మాణ కార్మికుల చట్టం 1996 సక్రమంగా అమలు కోసం అన్ని రాష్ట్రాల్లో సంక్షేమ బోర్డు అమలు కోసం ముఖ్యమంత్రి వైఎస్.జగన్ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై మహాసభలో చర్చించి ప్రభుత్వానికి గుణపాఠం వచ్చేలా కార్యక్రమాలు రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమర్ వల్లి, సిపిఐ నగర కార్యదర్శి కొండలరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నాలం వెంకటేశ్వరరావు ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బివి.కొండలరావు, జిల్లా కన్వీనర్ కె.రాంబాబు, కె.రమాదేవి, నాయకులు బి.రవిచంద్ర, చింతలపూడి సునీల్, జ్యోతి రాజు, కిర్ల కృష్ణ, గోవిందరాజు అచ్చయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల పరిశీలన

ప్రజాశక్తి- గోకవరం

తంటికొండలో నిర్మిస్తున్న జగనన్న కాలనీ పనులను శుక్రవారం రాజమహేంద్రవరం డిడిఒ పి.వీణాదేవి, ఎంపిడిఒ కెవిఎస్ఎస్.మూర్తి ఆధ్వర్యంలో పరిశీలించారు ఈ సందర్భంగా డిఎల్‌డిఒ మాట్లాడుతూ తంటికొండలో జగనన్న కాలనీ పనులు 40 శాతం అయ్యాయని, ఇంకా 60 శాతం పనులు పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. 60 శాతం కాలనీ పనులు త్వరితగతిన పూర్తిగా చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జగనన్న గృహాల్లో నివాసం ఉంటున్న లబ్ధిదారులను కాలనీల్లో నిర్మిస్తున్న పనులపై ఆరా తీశారు. రైతు భరోసా కేంద్రాలలో కొనుగోలు కేంద్రాలను సిబ్బంది విధి విధానాలను తెలుసుకున్నారు. వరి పంట పొలాల్లో వరి ధాన్యం కళ్లాలను పరిశీలించారు. తంటికొండలో నిర్మిస్తున్న బిసి కమ్యూనిటీ భవనాల ప్రహరీ గోడల పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ ఇఒ శ్రీనివాస్ దొర పాల్గొన్నారు.



జగనన్న కోలనీలను పరిశీలిస్తున్న వీణాదేవి

పంటల్లో తెగుళ్ల నివారణపై అవగాహన

ఉండ్రాజవరం : పంటల్లోని తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, అధిక దిగుబడుల సాధనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఒడిషాలోని పర్లాకిమిడి యూనివర్సిటీ విద్యార్థిని కేతా లక్ష్మీ సౌజన్య శుక్రవారం పాలంగి రైతులకు అవగాహన కల్పించారు. కాంప్లెక్స్ ఎరువుల కంటే, జీవామృతంతో పంటకు బలం చేకూరుతుందని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

జగనన్న కాలనీలో విద్యుత్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-బిక్కవోలు

బిక్కవోలులోని జగనన్న కాలనీలో విద్యుత్ పనులను శుక్రవారం అనపర్తి ఎంఎల్‌ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయని, దీనిలో భాగంగానే జగనన్న కాలనీల్లో 500 ళ్ల నిర్మాణాలు మొదలు పెట్టినట్టు చెప్పారు. ప్రభుత్వం రూ.50 లక్షల వ్యయంతో కాలనీ అంతా విద్యుదీకరణ చేసినట్టు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో కాలనీకి వాటర్ రావాలన్నా ఎలక్ట్రిసిటీ రావాలన్నా కొన్ని సంవత్సరాలు వేచి ఉండాల్సి వచ్చేదని ఆ పరిస్థితి లేద్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి రొంగల పద్మావతి అప్పాజీ, ఎంపిపి కొవ్వూరి జ్యోతిర్మయి శేషుకుమారి, సత్యనారాయణ రెడ్డి, ఎఎంసి చైర్మన్ జంగా వీర వెంకటసుబ్బారెడ్డి, ఎంపిడిఒ ఝాన్సీ, సర్పంచ్ సరెళ్ల సుమలత, ఎంపిటిసి జంపా వెంకటలక్ష్మి, వీరబాబు, గంగాధర్ రెడ్డి, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



నిత్యం పడే పెట్రోలు, గ్యాస్, కరెంట్ పిడుగుల ముందు ఇవో లెక్కా..!!



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపిపి

వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

క్రీడలు శారీరక దఢత్వంతో పాటు, మానసిక బలాన్ని కూడా కలుగజేస్తాయని ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి శరత్ అన్నారు. మండల కేంద్రమైన ఉండ్రాజవరం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో శుక్రవారం సిఎం ప్రైజ్‌మనీ నియోజకవర్గస్థాయి ఎంపికల్లో భాగంగా వాలీబాల్ పోటీలను ఆమె బాల్ సర్వీస్ చేసి పోటీలను ప్రారంభించారు. పాఠశాల హెచ్ఎం వి.విశ్వప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిపి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రీడలతో విద్యార్థులు సమాజంలో మంచి గుర్తింపు పొందుతారన్నారు. ఈ సందర్భంగా జరుగుతున్న పోటీల్లో ఉండ్రాజవరం ఉన్నత పరిషత్ పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మెండే వెంకటరావు, ఎంపిడిఒ ఎ.శ్రీనివాస్, ఎంఇఒ పివిఎస్.నాగరాజు, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ జి.మోహన్‌దాసు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కె.సోమేశ్వరరావు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు వల్లి, స్వామి పాల్గొన్నారు.

30న ఆర్‌టిసి పార్శిళ్ల వేలం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

సొంతదారులు గుర్తించని ఆర్‌టిసి పార్శిళ్లను ఈ నెల 30న బహిరంగ వేలం వేస్తున్నట్లు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పిబి.మల్లికార్జునరాజు తెలిపారు. 30వ తేదీ ఉదయం 10.30 గంటలకు రాజమహేంద్రవరం బస్ స్టేషన్‌లో పార్శిల్ కార్యాలయం వద్ద నిర్వహించే వేలంలో ఆసక్తిగలవారు పాల్గొనాలని ఆయన తెలిపారు.

67 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ప్రసాద్, 104 వాహన వైద్యుడు డాక్టర్ వెంకటేశ్వర్లు మండలంలోని కె.సావరంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాంలో 67 మందికి వైద్య పరీక్షలు చేశారు. మందులు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఎంఎల్‌హెచ్‌పి ఎ.సంధ్యాలక్ష్మి, ఎఎన్ఎం, వై.రత్నకుమారి, హెల్త్ అసిస్టెంట్ ఎ.విజయ్‌కుమార్, సూపర్‌వైజర్ జె.శ్రీనివాసరావు, కె.నాగమణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా మురళీకృష్ణ

ప్రజాశక్తి-నిడదవోలు

ఎపి రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా నిడదవోలుకు చెందిన చిన్నం మురళీకృష్ణ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పెద్దిరెడ్డి సుబ్బారావు, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కారింకి వెంకటేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మార్టిన్ లూథర్, రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి సంపూర్ణంగా కృషి చేస్తానని అన్నారు.

నిధులు విడుదల చేయాలని నిరసన

ప్రజాశక్తి -గోకవరం

ఎపిఎస్‌ఆర్‌టిసి కార్మికులకు చెల్లించాల్సిన లీవ్ ఎన్‌కాష్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం గోకవరం డిపో వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017 నుంచి సెలవు నగదు విడుదల చేయలేదని, అద్దె బస్సులు ప్రవేశపెట్టడం ద్వారా ఆర్‌టిసి నిర్వీర్యం, అవుతుందని మునుగడ ప్రశ్నార్థకం అవుతుందని తెలిపారు. ఆర్‌టిసి సొంత బస్సులను ప్రవేశ పెట్టడం ద్వారా ఉపాధి కల్పన దిశగా ప్రజారవాణా ద్వారా మరిన్ని సేవలు ప్రజలకు అందించడంలో కార్మికుల పాత్ర కోసం ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గోకవరం ఆర్‌టిసి డిపో ఎదురుగా నిరసన తెలిపినట్టు చెప్పారు.

ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ధరలను స్థిరీకరించలేని జగన్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ ధ్వజమెత్తారు. జగన్ పాలనంతా బాదుడే బాదుడు అనే నినాదంతో 10వ డివిజన్ ఆర్‌టిసి కాలనీలో వాసిరెడ్డి రాంబాబుతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ధ్వజమెత్తారు. అనంతరం లొలుగు నగర్‌లో అభివృద్ధి చేసిన పార్కును సందర్శించారు. ప్రజల సమస్యలను ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి భవానీ ద్వారా నగర పాలక సంస్థ అధికారుల దష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. వాసిరెడ్డి బాబి, కర్రి సత్యనారాయణ, రామారావు, వైవి.రావు, కె.నారాయణ, మహ్మద్ ఖాన్ భాయ్, చింత మహేష్, కంటిపూడి రాజేంద్రప్రసాద్, గరికిన రామారావు పాల్గొన్నారు.

గోదావరి పరిరక్షణ సమితి ఆందోళన అడ్డగింత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పేపరుమిల్లు రసాయన వ్యర్థాలు గోదావరి నదిలో కలపకూడదంటూ గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు పికె.విశ్వేశ్వరరెడ్డి చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారి తీసింది. కోటిలింగాల పేట సమీపంలో గోదావరి నది నుంచి పేపరుమిల్లుకు నీరు వెళ్లే ఇన్‌టేక్ పాయింట్ వద్ద శుక్రవారం ఉదయం టికె తన మద్దతుదారులతో కలిసి ఆందోళన చేపట్టారు. పంప్ హౌస్ వద్ద ఉన్న పేపరు మిల్లు సెక్యూరిటీ గార్డులను తోసుకుని టికె. తదితరులు లోపలికి వెళ్లగా కోటిలింగాల పేటకు చెందిన మర్రి పుష్పరాజ్ మిత్ర బృందం దీన్ని తప్పు పట్టింది. దీనిపై ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. పేపరు మిల్లు గూండాల దౌర్జన్యం నశించాలని టికె విశ్వేశ్వరరెడ్డి నినాదాలు చేశారు. దీనికి ప్రతిగా పుష్పరాజ్ మిత్ర బందం టికె దౌర్జన్యం నశించాలని నినాదాలు చేశారు. సుమారు గంట సేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు వచ్చి ఇరువర్గాలకు నచ్చచెప్పి అక్కడినుంచి పంపించి చేశారు.



బైఠాయించిన టికె.విశ్వేశ్వర్‌రెడ్డి

ప్రయాణికులతో ఆర్‌టిసి డిఎం సమావేశం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఎపిఎస్‌ఆర్‌టి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'ప్రయాణికుల సంతోష వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం డిపో మేనేజర్ ఎస్‌కె.షబ్నం ప్రయాణికులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఎం మాట్లాడుతూ డిపో పరిధిలోని ఏడు మండలాలకు బస్సులు నడుపుతూ ప్రజలకు సేవలందిస్తున్నామని, రాజమహేంద్రవరం బస్టాండ్, నగరంలోని వివిధ బస్టాండ్‌ల ద్వారా రోజూ సుమారు 30 వేలమంది ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణిస్తుంటారని చెప్పారు. వికలాంగులకు 50 శాతం రాయితీతో కాన్సెప్ట్ పాసులు అందిస్తున్నామని, విద్యార్థులకు ఉచిత కన్సెషన్ పాసులు, సీనియర్ సిటిజన్స్‌కు ప్రయాణ ఛార్జీలో 25 శాతం రాయితీ అందిస్తున్నామని డిఎం తెలిపారు. లైట్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి నిబంధనలకు అర్హత కలిగిన స్త్రీపురుష అభ్యర్థులకు శిక్షణ అందించి హెవీవెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఇచ్చి సహకరించే డ్రైవింగ్ స్కూలు రాజమహేంద్రవరం డిపోలో నడుపుతున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ అజయ్‌బాబు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్

ప్రజాశక్తి-గోపాలపురం

పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్‌కు ఆంధ్రు పద్మ సహకారంతో భోజన సదుపాయాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని టిడిపి మాజీ ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం గోపాలపురం చెక్ పోస్ట్ సెంటర్ వద్ద ప్రతి శుక్రవారం టిడిపి ఆధ్వర్యంలో నిరుపేదలకు అన్న క్యాంటీన్ ద్వారా దాతల సాయంతో ఉచిత భోజనం ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం అన్న క్యాంటీన్ ద్వారా రుచికరమైన వంటల భోజనం ప్రజలకు అందించేందుకు ఆంధ్రు పద్మ ముందుకు రావడం అభినందనీయమన్నారు. నిరుపేదలు ఆకలి తీర్చేందుకు ప్రతి శుక్రవారం అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. టిడిపి సేవా కార్యక్రమాలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జ్యేష్ఠ శ్రీధర్, ముప్పిడి అశోక్ కుమార్, జామి సూర్యచంద్రం, కొలుకులూరి రవికుమార్, చాపల రవి, జ్యేష్ఠ సత్యనారాయణ, పాలపు బుజ్జి పాల్గొన్నారు.

ప్రవీణ్ చౌదరి వల్ల వైసిపికి చెడ్డ పేరు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

చేసిన తప్పు కప్పిపుచ్చుకునేందుకు వైసిపిలో చేరిన పేపరు మిల్లు కార్మిక నాయకుడు ప్రవీణ్ చౌదరి వల్ల పార్టీకి చెడ్డపేరు వస్తోందని వైసిపి నాయకుడు మర్రి పుష్పరాజ్ విమర్శించారు. కోటిలింగాల పేట అంబేద్కర్ విగ్రహం వద్ద ఉన్న ఆడిటోరియంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుంకర బుజ్జి, జిమ్ కిరణ్ తగరం సోము తదితరులతో కలిసి పుష్పరాజ్ మాట్లాడారు. చేసిన తప్పుకు సిగ్గు పడకుండా పార్టీలో సీనియర్ నాయకుడు శివరామ సుబ్రహ్మణ్యం గురించి నోటికి వచ్చినట్లు పేలితే సహించేది లేదన్నారు. ప్రవీణ్ సంగతి తేల్చడానికి శివరామ సుబ్రహ్మణ్యం రానవసరం లేదని, అతడిలాంటి చెంచా సంగతి తేల్చేయడానికి తాము చాలని పుష్పరాజ్ హెచ్చరించారు. శివరామసుబ్రహ్మణ్యంకు క్షమాపణ చెప్పకపోతే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో డేవిడ్, కామేష్ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గంగోలులో గడపగడపకూ..

ప్రజాశక్తి-గోపాలపురం

నేడు మండలంలోని గంగోలు పంచాయతీలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహిస్తామని క్యాంప్ కార్యాలయం సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు.

బ్యాంకు సేవలకు అంతరాయం

ప్రజాశక్తి-గోపాలపురం

గోపాలపురం యూనియన్ బ్యాంక్‌లో విద్యుత్ లేకపోవడంతో బ్యాంకు సేవలు నిలిచిపోవడంతో కస్టమర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు వాపోయారు. బ్యాంకులో విద్యుత్ లేకపోవడంతో మధ్యాహ్నం వరకు సేవలందక ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని ఆవేదన చెందారు. బ్యాంకు మేనేజర్ సిహెచ్ నవీన్‌ను వివరణ కోరగా బ్యాంకుకు సంబంధించి కరెంటు లేనప్పుడు యుపిఎస్ ఉంటుందని తెలిపారు. యుపిఎస్ రిపేర్‌లో ఉందన్నారు. బయట జనరేటర్ తెప్పించి సేవలు ప్రారంభిస్తామని తెలిపారు.

జావెలిన్‌త్రోలో శ్రీనివాస్ ప్రతిభ

ప్రజాశక్తి-చాగల్లు

కలవలపల్లి జెడ్‌పి పాఠశాల విద్యార్థి మట్టా శ్రీనివాస్, జిల్లా స్థాయి జరిగిన స్కూల్ గేమ్స్‌లో జావెలిన్ త్రోలో ద్వితీయ స్థానం సాధించాడని హైస్కూల్ హెచ్ఎం ముత్యాల విఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. ఉపాధ్యాయులు కోయ గంగాధర్ రావు, విద్యార్థి శ్రీనివాసులు పాల్గొన్నారు.

తెలుగు మహిళ ఆధ్వర్యాన 'మాటా మంతి'

ప్రజాశక్తి-బిక్కవోలు

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం తెలుగు మహిళ 'మాటా మంతి' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహిళలతో సమావేశమై వైసిపి పాలనలో మహిళలు పడుతున్న ఇబ్బందులపై చర్చించారు. జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, నాయకులు మజ్జి పద్మ, బేరా వేణమ్మ, సూర్యకుమారి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - మండపేట

స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్లో మహిళా అదృశ్యంపై శుక్రవారం కేసు నమోదయ్యింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక గాంధీనగర్‌నగరానికి చెందిన వివాహిత ఏ. స్వర్ణకుమారికి స్థానిక సైదులు పేటకు చెందిన సత్తిబాబుతో వివాహం జరిగింది. అయితే గత ఏడాది నుంచి ఆమెకు మతిస్థిమితం లేకపోవడంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఈనెల 22వ తేదీన మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఇంటిలో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. బంధువులు, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎంత వెతికిన ఆమె ఆచూకీ లభించకపోవడంతో తండ్రి సత్తిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్.ఐ కె.అప్పారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి - రావులపాలెం

రావులపాలెం మండలం గోపాలపురం ప్రధాన పంట కాలువలో శుక్రవారం గుర్తుతెలియని మతదేహాన్ని కనుగొన్నట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. మతుడి వయస్సు40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. మతుడి శరీరంపై నలుపురంగు నిక్కరు ఉందన్నారు. మతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

విద్యుత్ మోటార్లు చోరీ

ప్రజాశక్తి -ఆత్రేయపురం

మండలంలోని రెండు గ్రామాల్లో విద్యుత్ మోటర్లు చోరీకి గురయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కట్టుంగలో ఓగిరెడ్డికి చెందిన స్థలంలో వేసిన 3హెచ్.పి మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. అలాగే తాడిపూడి జగనన్న ఇళ్ల స్థలాలలో పంచాయితీ వారు ఏర్పాటుచేసిన రెండు మోటర్లు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు కేసులు నమోదు చేశామని ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

కల్వర్టు గోడను ఢీకొన్న స్కూల్ బస్సు

ప్రజాశక్తి - కాట్రేనికోన

పల్లంకుర్రు నుంచి అమలాపురం వెళ్తున్న భాష్యం స్కూలు బస్సు కందికుప్ప పెట్రోల్ బంక్ వద్ద అదుపు తప్పి కల్వర్టు గోడను ఢీ కొట్టింది. ఎదురుగా వస్తున్న ఆర్‌టిసి బస్సును తప్పించబోవడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు స్వల్ప గాయాలకు గురయ్యారు. భయాందోళనకు గురైన పిల్లలు కేకలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. సమీపంలోని పెట్రోల్ బంకు సిబ్బంది బస్సులోని విద్యార్థులను దింపి ధైర్యం చెప్పారు. సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు సంఘటన స్థలానికి చేరుకుని పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. పోలీసులు వివరాలు సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని గాడి మొగ పంచాయతీ సమీపంలో మెయిన్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో చింతా విజయ(28) మృతి చెందింది. స్థానికుల తెలిపిన వివరాల మేరకు కాకినాడ ఏటిమొగకు చెందిన చింత విజయ గాడి మొగలో తన మేనమామ సంగాడి మావుళ్ల వద్ద ఉంటోంది. ఓ ప్రయివేటు రొయ్యల కంపెనీలో అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తుంది. శుక్రవారం ఉదయం కోరంగిలో ఉన్న రొయ్యల కంపెనీకి వెళ్లడానికి ఆటో కోసం రోడ్డు పక్కన నడిచి వెళుతుండగా దరియాల తిప్ప పెట్రోల్ బంక్ నుంచి తాళ్లరేవు వైపు వస్తున్న ట్రాక్టరు ఆమెను ఢీకొంది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిజిహెచ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పోలేకుర్రు జై భీమ్ పేట సమీపంలో శుక్రవారం ఇరిగేషన్ కార్యాలయం ఎదురుగా జాతీయ రహదారి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. కోరంగి పోలీసులు, చెక్ పోస్ట్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలకు చెందిన ఎ.సందీప్, ఎస్.ఉదయ్, బైకుపై యానాం నుంచి కాకినాడవైపు వెళ్తున్నారు. అదే సమయంలో తాళ్లరేవు నుంచి అమలాపురం వైపు వెళ్తున్న కారును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో సందీప్, ఉదయ్ గాయపడ్డారు. సందీప్ అపస్మారక స్థితిలో ఉన్నాడు. అతన్ని 108లో కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. కారులో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కోరంగి పోలీసులు కేసు నమోదు చేశారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

ప్రజాశక్తి -మామిడికుదురు

అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ ఆదుర్రుకు చెందిన పితాని నాగలక్ష్మి ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని నగరం ఎస్ఐ షేక్ జానీబాషా తెలిపారు. అయినవిల్లి మండలం తొత్తరమూడి పెదపాలెనికి చెందిన పితాని గణేశ్వరరావుతో నాగలక్ష్మికి 2019 నవంబర్ 6న వివాహమైంది. ఆ సమయంలో రూ.1.90లక్షల వరకూ కట్నం, మూడు కాసుల బంగారం ఇచ్చినట్లు నాగలక్ష్మి ఫిర్యాదులో పేర్కొంది. అనంతరం వారికి పాప పుట్టింది. అప్పటి నుంచి అదనపు కట్నం భర్తతో పాటు మిగిలిన వారు వేధిస్తున్నారని పేర్కొంది. భర్త గణేశ్వరరావు, అత్త గనూలక్ష్మి, మామ కృష్ణమూర్తి, ఆడపడుచు భాగ్యశ్రీలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసింది.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - కాజులూరు

అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న అడబాల వెంకటరమణను అరెస్టు చేసినట్లు తాళ్లరేవు ఎస్ఇబి సిఐ బి.భవాని తెలిపారు. మండలంలోని జగ్గంపూగిరిలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నారని గ్రామస్తుల స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఇబి సిబ్బంది తనిఖీలు నిర్వహించగా అడబాల వెంకటరమణ వద్ద పది మద్యం బాటిల్లు లభించాయని తెలిపారు. నిందితుని శనివారం కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి -అమలాపురం

జిల్లాలో ఇటీవల సంభవించిన గోదావరి వరదల్లో కొట్టుకుపోయి మరణించిన పి.గన్నవరం మండలం మానేపల్లి గ్రామానికి చెందిన కారాడి రామకృష్ణ, కడలి శ్రీనివాసరావుల కుటుంబాలకు ముఖ్యమంత్రి మంజూరు చేసిన చెక్కులను కలెక్టర్ హిమాన్షుశుక్లా, ఎంఎల్‌ఎ చిట్టిబాబు చేతుల మీదుగా శుక్రవారం అందించారు. గతంలో ఒక్కొక్క కుటుంబానికి ఇచ్చిన రూ.4 లక్షల అందించారు. అదనంగా మరో రూ.6లక్షల చొప్పున అందజేశారు. మృతుల కుటుంబ సభ్యులు కారాడి లక్ష్మి, కడలి మంగలక్ష్మికి అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పితాని చంద్రకళ, హితకారిణి సమాజం అధ్యక్షుడు కాశీ మునికుమారి, నాయకులు నరసింహారావు, కుసుమ సునీల్, వారా లక్ష్మి నరసింహారావు, తహశీల్దార్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'అన్నపూర్ణ'కు సిఎస్ఆర్ గుర్తింపు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని ర్యాలి గ్రామానికి చెందిన అన్నపూర్ణ ఆర్గాన్స్ సేవా సమితికి సిఎస్ఆర్ గుర్తింపును కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందని సంస్థ అధ్యక్షులు కాశిన అన్నపూర్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక మ్యాజిక్ హౌస్‌లో ఈ వివరాలు మీడియాకు వివరించారు. ఈ ప్రభుత్వ ఉత్తర్వులు ద్వారా కార్పొరేట్ సంస్థలతో కలిసి సామాజిక సేవ చేసే అవకాశం తమ సంస్థకు దక్కిందన్నారు. ఈ గుర్తింపు మరింత బాధ్యతను పెంచిందన్నారు.

చిత్రలేఖనంలో రావులపాలెం బాలికలకు బంగారు పతకాలు

ప్రజాశక్తి-రావులపాలెం


విశాఖకు చెందిన చోదవరం చిత్రకళ నిలయం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రకళ పోటీల్లో రావులపాలెం ఎస్ఎస్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినిలు ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించారని హెచ్ఎం కె.సువర్ణకుమారి తెలిపారు. సీనియర్స్ విభాగంలో జి.భవనశ్రీ, రుక్మిణి, బి.అలేఖ్య, బి.లక్ష్మీప్రసన్న బంగారు పతకాలు, మెరిట్ సర్టిఫికెట్లు సాధించారు. జూనియర్స్ విభాగంలో యర్రగడ్డ రిషిక, జె.దివ్యవెంకటగాయత్రిదేవి, కె.దుర్గాలక్ష్మి, ఎం.హేమ ప్రవల్లిక సుహాసిని, కె.జ్ఞానముక్తేశ్వరి బంగారు పతకాలతోపాటు మెరిట్ సర్టిఫికెట్లను సాధించారు. ఈసందర్భంగా హెచ్ఎం విద్యార్థులను, డ్రాయింగ్ టీచర్ డి.వెంకటమధుమూర్తిని అభినందించారు.

పోర్టులతో రాష్ట్రం అభివృద్ధి

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి - కాకినాడ

పోర్టులతో రాష్ట్రం అభివృద్ధి చెందనుందని పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ తెలిపారు. శుక్రవారం రూ.90 కోట్లతో కాకినాడ యాంకరేజి పోర్టులో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడారు. 30 వేల మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న యాంకరేజి పోర్టు అభివృద్ధి పనులను తాను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ పనులతో ప్రస్తుత పోర్టు సామర్థ్యం మరో మిలియన్ టన్ను మేరకు పెరుగుతుందన్నారు. మరో 5వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. దేశంలో రెండవ అతి పెద్ద సముద్ర తీరం 970 కిలోమీటర్లు రాష్ట్రం కలిగి ఉందన్నారు. నూతన పోర్టులతో తీరాన్ని అభివద్ధి చేయాలనే ఆలోచనతో మార్టైమ్ బోర్డును సిఎం ఏర్పాటు చేశారన్నారు. 10 పోర్టులతో అత్యధిక ఆదాయాన్ని అందించే రాష్ట్రంగా చరిత్రలో ఆంధ్రప్రదేశ్ నిలవబోతుందన్నారు. పోర్టులే కాకుండా 9 ఫిషింగ్ హార్బర్ల అభివృద్ధికి ముఖ్యంత్రి ఆదేశించారన్నారు. ఇప్పటికే నాలుగు హార్బర్ల నిర్మాణం జరుగుతుదన్నారు. ఉప్పాడ హార్బర్‌లో రూ.270 కోట్లతో మరో హార్బన్‌ను నిర్మిస్తామన్నారు. బల్క్‌డ్రగ్ పార్కు కాకినాడ తీరంలోనే రూ.1000 కోట్లతో ఏర్పాటు కానుందన్నారు. దీని ద్వారా 20 వేల మందికి ప్రత్యక్షంగా, మరో 20 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందన్నారు. ఈ పార్కు వల్ల నష్టం జరుగుతుందని ప్రతిపక్షాలు లేఖలు రాయడం దురదృష్టకరమన్నారు. దేశంలో అత్యధికంగా బియ్యం ఎగుమతులు జరుగుతున్న కాకినాడ యాంకరేజి పోర్టుపై కూడా మాదకద్రవ్యాల సరఫరా జరుగుతోందని బురద జల్లి దెబ్బతీసే ప్రయత్నం చేశారన్నారు. వ్యవసాయ ఆధారిత జిల్లా ఉన్న ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాను రానున్న కాలంలో పారిశ్రామిక ప్రాముఖ్యత కలిగిన జిల్లాగా మలచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కషి చేస్తోందన్నారు. త్వరలో విశాఖపట్టనం, కాకినాడ తీరంలో రూపుదిద్దుకోనున్న పెట్రో కెమికల్ కారిడార్ దేశానికే తలమానికం కానుందని తెలియజేశారు. పారిశ్రామికా అభివద్ధితో పాటు ఈ ప్రాంతంలో ఐటి రంగ అభివద్ధికి కూడా చర్యలు చేపడతామన్నారు. యాంకరేజి పోర్టు కార్మికులు తన దష్టి తెచ్చిన సమస్యలను ముఖ్యమంత్రికి తెలిపి పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో కాకినాడ లో తొలిసారిగా 8వేల టన్నుల సామర్థ్యంతో బ్రోత్రా షిప్పింగ్, సాన మెరైన్ సంస్థల ద్వారా నిర్మించిన షిప్‌ను ఆయన ప్రారంభించారు. మంత్రి వేణు మాట్లాడుతూ యాంకరేజి పోర్టు అభివృద్ధితో పోర్టుపై ఆధారపడిన 30 వేల కార్మికులకు సిఎం భరోసానిచ్చారన్నారు. ఆర్ అండ్ బి శాఖ మంత్రి దాడిశెట్టి రాజా మాట్లాడుతూ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంశంలోను, జిడిపి వద్ధిలోను ఆంధ్రప్రదేశ్ దేశంలో అగ్రస్థానంలో ఉందన్నారు. ఓర్వలేని ప్రతిపక్ష నేతలు, పక్షపాత మీడియా విష ప్రచారానికి పాల్పడుతున్నాయన్నారు. కాకినాడ ఎంపి వంగాగీత మాట్లాడుతూ జిల్లాలో పోర్టులు అభివద్ధి హార్షణీయమన్నారు. పారిశ్రామిక విస్తరణ అవసరాల దష్ట్యా విమానాశ్రయాన్ని కూడా మంజూరు చేయాలని మంత్రిని కోరారు. ఎపి మారిటైం బోర్డు చైర్మన్ కె.వెంకటరెడ్డి, ఎంఎల్‌ఎ కురసాల కన్నబాబు మాట్లాడుతూ కాకినాడ యాంకరేంజి పోర్టు పూర్వ వైభవాన్ని అందుకోనున్నందుకు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ఎపి మారిటైం బోర్డు డిప్యూటీ సిఇఒ బిఎం.రవీంద్రరెడ్డి, కలెక్టర్ కృతికా శుక్లా, కుడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, పోర్టు ఆఫీసర్ కెప్టెన్ కె.ధర్మశాస్త, మెరైన్ ఎస్ఈ జి.వి.రాఘవరావు, కోకనాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు వారణాసి రాఘవులు, కార్మిక సంఘాల నేతలు ఎ.సత్తిబాబు, పి.నూకరాజు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మంత్రి అమర్‌నాథ్

మృత్యుఒడికి దర్శిత్

జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి
14 రోజుల క్రితం విద్యుదాఘాతానికి గురైన చిన్నారి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్, తాళ్లపూడి



విద్యుదాఘాతంతో రెండు కాళ్లను కోల్పోయి కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న జొన్నకూటి దర్శిత్(3) 14 రోజుల పాటు మృత్యువుతో పోరాడి శుక్రవారం సాయంత్రం తుది శ్వాస విడిచాడు. చిన్నారి మరణం పలువురిని కలిచివేసింది. పలువురు దాతలు స్పందించినా చిన్నారిని మృత్యుకోరల నుంచి బతికించలేకపోయారు. దర్శిత్ మరణంతో సొంత గ్రామమైన పైడిపెట్టలో విషాదం నెలకొంది.

తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం పైడిమెట్టకు చెందిన దర్శిత్ మూడేళ్ల బాలుడు. ఆడుతూపాడుతూ తిరిగేవాడు. చిన్నారి తల్లి చాందిని ఈ నెల 12న డాబాపై దుస్తులు ఆరబెట్టేందుకు వెళ్లింది. ఆమెతో పాటు దర్శిత్ వెళ్లాడు. ఆమె పనిలో నిమగ్నమై ఉండగా డాబా చెంతనే ఉన్న 33కెవి విద్యుత్‌లైన్ల వద్ద దర్శిత్ అడుకుంటూ విద్యుదాఘాతానికి గురై పడిపోయాడు. ఇది గమనించి తల్లి వెంటనే స్థానికంగా ఉన్న ప్రయివేటు ఆసుపత్రికి తరలించింది. పరిస్థితి విషమంగా ఉండటంతో కాకినాడ జిజిహెచ్‌కు తీసుకెళ్లింది. నాలుగు రోజుల చికిత్స అనంతరం ఇన్ఫెక్షన్ సోకడంతో బాలుడి రెండు కాళ్లను మోకాళ్ల కింది వరకూ వైద్యులు తొలగించారు. అప్పటి నుంచి పరిశీలనలో ఉంచారు. ఇన్ఫెక్షన్ తగ్గకుంటే మోకాళ్లపై వరకూ తొలగించాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు. శుక్రవారం నాటికి కూడా ఇన్‌ఫెక్షన్ తగ్గకపోవడంతో కుడికాలులో కొంత భాగాన్ని శస్త్రచికిత్స చేసి తొలగించారు. అనంతరం దర్శిత్‌ను వార్డుకు తరలించారు. కొద్దిసేపటికే పల్స్ పడిపోవడంతో చిన్నారి మృతి చెందాడు. చిన్నారి ఎలాగైనా బతుకుతారని అందరూ ఎదురుచూశారు. పేద కుటుంబం కావడంతో ఎంతో మంది దాతలు స్పందించి ఆర్థిక సాయం కూడా అందించారు. అయినప్పటికీ చిన్నారి మృతి చెందడంతో అందరిలోనూ విషాదం అలముకుంది.

పలువురి పరామర్శ, ఆర్థిక సాయం

జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారిని శుక్రవారం ఉదయం పలువురు పరామర్శించారు. దాతలు ఆర్థికం సాయం సైతం అదంఇంచారు. హోం మంత్రి తానేటి వనిత, ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్‌పి ఎం.రవీంద్రనాథ్‌బాబు చిన్నారిని పరామర్శించారు. మంత్రి వనిత జిజిహెచ్ అధికారులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. తల్లిదండ్రులను ఓదార్చారు. ఇదే రోజు సాయంత్రం చిన్నారని మృతువాడికి చేరాడు. గోపాలపురం మండలం వాదాలకుంటకు చెందిన రాగూర టీమ్ చిన్నారి వైద్యం కోసం రూ.40వేలు సాయం అందించారు.

అన్ని రంగాల్లో ప్రభుత్వ విఫలం

ప్రజాశక్తి-రావులపాలెం

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి వైసిపి నేతలు అబద్ధాలతో ప్రజల్ని మభ్యపెడుతున్నారని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం రావులపాలెం మండలం పొడగట్లపల్లిలో అల్లూరి సత్తి రాజు గహం వద్ద క్లస్టర్ 5 పరిధిలో క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జిలు, బూత్ కన్వీనర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సత్యానందరావు మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేసేందుకు సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో గుత్తుల పట్టాభిరామారావు, బండారు శ్రీనివాసరావు, అల్లూరి పెదకృష్ణంరాజు, జి.సత్తిబాబు, కె.రాజు, పమ్మి సుబ్బయ్య, మారే ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షకు వ్యతిరేకంగా ప్రచారం

ఆత్రేయపురం : లింగ వివక్షకు వ్యతిరేకంగా గ్రామాల్లో ప్రచారం చేయాలని జడ్‌పిటిసి సభ్యులు బోనం సాయిబాబు, ఎంపిడిఒ నాతి బుజ్జి అన్నారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతోను, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డ్వాక్రా విలేజ్ ఆర్గనైజేషన్లకు ఈ మేరకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈనెల 25 నుంచి వచ్చేనెల 23వరకూ ఈ ప్రచారం జరుగుతుందన్నారు. దీన్ని విజయవంతం చేయాలని కోరారు.

మురుగుకాలువ పరిశీలన

తాళ్లరేవు : మండలంలోని మల్లవరం పంచాయతీ గ్రాంట్ ఏరియా, యానాం దొమ్మేటి వారి పేట సరిహద్దులో ఉన్న మురుగు కాలువ గేట్లను అధికారులు శుక్రవారం పరిశీలించారు. మురుగు కాలువకు తలుపులు బిగించాలని, కాలువను బాగు చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఇటీవల స్పందనలో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అధికారులు పరిశీలించారని సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు తెలిపారు. మురుగు కాలువ పూడుకు పోవడంతో వందలాది ఎకరాల్లో పంట ప్రతి ఏడు ముంపునకు గురవుతుందన్నారు. రైతులు లక్షల రూపాయలు నష్టపోతున్నారని తెలిపారు. తలుపులు పూర్తిగా పాడైపోవడం వల్ల గోదావరిలో నీరు ఎక్కువగా ఉన్నప్పుడు పొలాల్లోకి ఎగబాకుతుందన్నారు. పరిశీలన అనంతరం సమస్యను జిల్లా అధికారుల దష్టికి తీసుకెళ్తామని డ్రెయినేజీ శాఖ అధికారులు తెలిపారని రాజబాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో కుక్కల కృష్ణ, మేడిశెట్టి శ్రీనివాసు, డ్రెయినేజీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డీన్ డాక్టర్ రవి కుమార్ బెస్ట్ లైబ్రరీ యూజర్ అవార్డు పొందిన అధ్యాపకులకు, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.వెంకటరమణ, విభాగాధిపతులు, ఫాకల్టీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎఎస్‌ఒఎంఇ విద్యార్థి విభాగం ప్రారంభం

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో అమెరికన్ సొసైటీ అఫ్ మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థి విభాగాన్ని ఆదిత్య గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. మెకానికల్ విద్యార్థులకు పరిశోధనలకు, ఉద్యోగావకాశాలకు ఇది ఉపయుక్తంగా ఉంటుందని ఆయన తెలిపారు. మేనేజర్ తానియా రోడ్రిగస్ మాట్లాడుతూ ఈ సొసైటీ విద్యార్థులకే కాక అధ్యాపకులకూ ఉపయోగమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ డోలా సంజయ్ సుబ్రహ్మణ్యం, డీన్ డాక్టర్ ఎ.రామకృష్ణ, మెకానికల్ విభాగాధిపతి పులి దానయ్య పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్స్ పనుల పరిశీలన

ప్రజాశక్తి - జగ్గంపేట

సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం వేగవంతంగా జరగాలని జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల చంటిబాబు అన్నారు. శుక్రవారం ఆయన జగ్గంపేటలోని ట్రావెల్స్ బంగ్లా ఆవరణలో నిర్మిస్తున్న సులభ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలించారు. దూర ప్రాంతాల నుంచి టౌనుకు చేరుకున్న వారికి మరుగుదొడ్ల సమస్య లేకుండా ఉండేందుకు దీన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. ఆయన వెంట వైసిపి రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి రఘురామ్ ఉన్నారు.

ఆదిత్యలో ముగిసిన డేటా సైన్స్ ఫెయిర్

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల బీఎస్సీ డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో టెక్నికల్ వర్క్ షాప్ " డేటా సైన్స్ ఫెయిర్ ఘనంగా ముగిసినట్లు జరిగినట్లు కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్ నాయుడు తెలిపారు. కళాశాల బీఎస్సీ డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు ప్రాజెక్ట్ ఎక్స్‌ప్రో, క్విజ్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన టెక్ మహేంద్ర సీనియర్ డేటా సైంటిస్ట్ పి మోహన్ ఉత్తమ ప్రాజెక్టులను రూపొందించిన విద్యార్థులను అభినందించి విజేతలకు పశంసాపత్రాలను, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఇంచార్జ్ మూర్తి, కంప్యూటర్స్ అధ్యాపకులు విజయలక్ష్మి, దివాకర్ రావు, జానకి రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపిటిసిలకు గుర్తింపు కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్లరేవు ఎంపీపీ రాయుడు సునీత శుక్రవారం మండలంలోని ఎంపిటిసి సభ్యులకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంచాయతీరాజ్ విభాగం ద్వారా నూతనంగా ఈ ఏడాది నుంచి ఎంపిటిసి లకు గుర్తింపు కార్డులు రూపొందించిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, ఎంపిడిఒ ఎం.అనుపమ, తహశీల్దార్ పోతురాజు, వైస్ ఎంపిపిలు ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కొపనాతి లలిత , పలువురు ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి- పెద్దాపురం

రబీ వరి సాగులో అధిక దిగుబడులు సాధించే విధంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై రైతుల్లో అవగాహన పెంచాలని వ్యవసాయ పరిశోధనా స్థానం అధిప డాక్టర్ పి.మునిరత్నం అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ పరిశోధన కేంద్రంలో వ్యవసాయ అధికారులతో జరిగిన జిల్లా స్థాయి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. వచ్చే రబీ కాలానికి ప్రాంతాలవారీగా సరిపడే వరి విత్తనాలపై ఆయన వివరించారు. సమావేశంలో ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్ వి నరసింహారావు, డాక్టర్ ఏ సీతారామ శర్మ,డాక్టర్ బి బాలాజీ నాయక్, డాక్టర్ ఐ సుధీర్ కుమార్, సుజాత, జ్యోతిర్మయ్, బోసు పాల్గొన్నారు.

18.84 మెట్రిక్ టన్నుల పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం రూరల కాతేరు గ్రామన్ బ్రిడ్జి సమీపంలో వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 18.84మెట్రిక్ టన్నుల పిడిఎస్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రీజినల్ విజిలెన్స్ ఎస్‌పి పివి.రవికుమార్ ఈ వివరాలను వెల్లడించారు. తెలంగాణా రాష్ట్రం ఖమ్మం నుంచి పెద్దాపురానికి వ్యాన్‌లో తరలిస్తుండగా అధికారులు పట్టుకున్నారన్నారు. 345 బస్తాలలో వీటిని తరలిస్తున్నారని తెలిపారు. ఎటువంటి బిల్లులు లేకపోవడంతో సీజ్ చేశామని తెలిపారు. ఈ బియ్యం కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం బి.ప్రత్తిపాడుకు చెందిన మునుగుల శ్రీనివాస్‌కు చెందినవిగా గుర్తించామన్నారు. వీటి విలువ రూ.22.15 లక్షలు ఉంటుందన్నారు. వ్యాన్ పిఠాపురానికి చెందిన ఆకుల వీరబాబుకు చెందినదన్నారు. వ్యాన్ డ్రైవర్ గంట సుభాష్‌ను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. డ్రైవరు, అసిస్టెంట్, ఓనర్, బియ్యం యజ మానిపై క్రిమినల్ కేసులు నమోదు చేయా లని పోలీసులకు సిఫార్సు చేశామని తెలిపారు.

బడ్జెట్‌లో కాపులకు రూ.3 వేల కోట్లు కేటాయించాలి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

రాష్ట్ర బడ్జెట్లో కాపులకు రూ.3వేల కోట్లు కేటాయించాలని, కాపుల స్థితిగతులపై త్రీమెన్ కమిటీ నివేదికను బహిర్గతం చేయాలని ఆంధ్ర కాపు సద్భావన సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం కాకినాడలోని శుభం కాపు కళ్యాణ మండపంలో కాపు సద్భావన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి ఏసుదాసు అధ్యక్షతన కాపు ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. కాపు జెఎసి రాష్ట్ర సభ్యుడు ఆరేటి ప్రకాష్ మాట్లాడుతూ కాపుల అధ్యయానికి రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, కురసాల కన్నబాబు, అంబటి రాంబాబులతో కమిటీని నియమించిందన్నారు. మూడేళ్లు దాటినా అసలు కమిటీ ఉందో లేదో తెలీని పరిస్థితి నెలకొందన్నారు. ఐదు శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాపు కార్పొరేషన్‌కు రూ.1000 కోట్లు కేటాయించాలని, విద్య రుణ పథకం అమలు చేయాలని, వ్యక్తిగత రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి ఏసుదాసు మాట్లాడుతూ కాపులకు జనాభా ప్రకారం దామాషా పద్ధతిలో రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. కాపు యువతకు వృత్తి శిక్షణ నైపుణ్యాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సురుచి కాజా అధినేత పోలిశెట్టి మల్లిబాబును ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బసవా ప్రభాకరరావు, పి.రామలక్ష్మి, రెడ్నం రాజా, ఎ.శ్రీలక్ష్మి, వెంకటేష్ నాయుడు, పెంటపాటి చంద్రశేఖర్, గట్టి సత్యనారాయణ, చిట్నీడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి -రౌతులపూడి

ఇంటి పన్నుల వసూళ్లపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని పెద్దాపురం డిఎల్‌పిఒ బాలమణి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమావేశమయ్యారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఎ.మల్లవరం గుమ్మరేగుల గ్రామాల్లో ఉన్న చెత్త నుంచి సంపద కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఆమె వెంట ఇఒపిఆర్‌డి వెంకట్రావు ఉన్నారు.

పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శివాలయం వీధిలోని రూ.11.99 లక్షలతో నిర్మించనున్న పొట్టి శ్రీరాములు మున్సిపల్ పాఠశాల నిర్మాణ పనులకు శుక్రవారం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ సిహెచ్‌వి. సత్యనారాయణ, కౌన్సిలర్ జి.అప్పారావు, కౌన్సిల్ కోఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, వైసిపి నాయకులు కనకాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, బొడ్డు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే వారికి సముచిత స్థానం

కాకినాడ కార్పొరేషన్ : కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసిన వారికి సముచిత స్థానం లభిస్తుందని పిసిసి సభ్యులు నులుకుర్తి వెంకటేశ్వర్లు, ఆకుల వెంకటరమణ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పిసిసి నూతన అధ్యక్షులుగా గిడుగు రుద్రరాజుని నియమించడంతో కాకినాడ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మిఠాయిలు పంచి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ రుద్రరాజు నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం చెందుతుందని అన్నారు.